
రామాయంపేటలో ఏర్పాటు చేసిన మహిళా పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న మండల ఎన్నికల అధికారి ఉమాదేవి


చిన్నశంకరంపేట : అంబాజీపేటలో పోలింగ్ కేంద్రానికి చేరుకున్న ఎన్నికల సిబ్బంది


రామాయంపేట: దామరచెర్వులో ఏర్పాట్లు చేస్తున్న అధికారులు

# మెదక్‌లో 274 పోలింగ్ కేంద్రాలు

## ఓటర్లు 2,16,748 మంది.. బరిలో 13 మంది అభ్యర్థులు

- పోలింగ్ కేంద్రాలకు ఈవీఎంలతో చేరుకున్న సిబ్బంది
- పోలింగ్ కేంద్రాల వద్ద పారామిలటరీ బలగాలతో పటిష్ట భద్రత
- మహిళా పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన రామాయంపేట మండల ఎన్నికల అధికారి

రామాయంపేట/నిజాంపేట/చిన్నశంకరంపేట/రామాయంపేట రూరల్/పాపన్నపేట, నవంబర్ 29: నేడు(గురువారం) జరిగే తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల పోలింగ్‌కు అధికార యంత్రాంగం సర్వం సిద్ధం చేసింది. మెదక్ నియోజకవర్గంలో 2,16,748 మంది ఓటర్లు ఉండగా, 274 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామని, 13 మంది అభ్యరులు బరిలో ఉన్నారని అధికారులు తెలిపారు. బుధవారం రామాయంపేట పట్టణంతో పాటు మండలంలోని గ్రామాల్లో మండల ఎన్నికల అధికారి, పురపాలిక కమిషనర్ ఉమాదేవి పోలింగ్ బూత్‌లను పరిశీలించారు. పట్టణంలోని 74, 78 బూత్‌లను మహిళలకు ప్రత్యేక పోలింగ్ కేంద్రాలుగా ఏర్పాటు చేశారు. వాటిని మండల ఎన్నికల అధికారి ఉమాదేవి పరిశీలించారు. బూత్‌లలో మహిళలకు, పురుషులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా అన్ని ఏర్పాట్లు చేశారు. రామాయంపేట పురపాలికలోని 14 పోలింగ్ బూత్‌లు కాగా మండల వ్యాప్తంగా వివిధ గ్రామాల్లో 25 పోలింగ్ బూత్‌లు మొత్తం 39 బూత్‌లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రతి పోలింగ్ బూత్ వద్ద పారామిలిటరీ బలగాలతో పటిష్ట భద్రతను ఏర్పాటు చేశారు.మిలటరీ బలగాలు ఎన్నికలకు వస్తున్న సిబ్బందిని అణువణువు పరిశీలిస్తున్నారు. ఓటు హక్కు ఉన్న ప్రతి ఒక్కరూ నిర్భయంగా తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఓట్లు వేయడం కోసం దివ్యాంగులకు ప్రత్యేకంగా వీల్‌చైర్‌లను ఏర్పాటు చేసినట్లు మండల ఎన్నికల అధికారి వెల్లడించారు.

☛ అసెంబ్లీ ఎన్నికలకు నిజాంపేట మండల వ్యాప్తంగా 28 పోలింగ్ కేంద్రాల్లో బుధవారం పోలింగ్ సిబ్బంది సామగ్రితో చేరుకున్నారు. ఈ మేరకు నందిగామలో పోలింగ్ కేంద్రాలు 106, 107లకు సంబంధించిన సామగ్రితో పోలింగ్ సిబ్బంది చేరుకున్నారని, వారికి అన్ని రకాల వసతులను కల్పించామని పంచాయతీ కార్యదర్శి ఆరీఫ్‌హుస్సేన్ తెలిపారు. సమస్యాత్మకంగా ఉన్న పోలింగ్ కేంద్రాల వద్దకు భద్రత బలగాలు చేరుకున్నాయి. కార్యక్రమంలో పోలింగ్ సిబ్బంది ఉన్నారు.

☛ అసెంబ్లీ ఎన్నికలకు రామాయంపేట మండలంలో అన్ని గ్రామాల్లో పోలింగ్ బూత్‌ల్లో అధికారులు సర్వం సిద్ధం చేశారు. బుధవారం పోలింగ్ అధికారులు బూత్‌ల్లో ఏర్పాట్లు పరిశీలించారు. ఓటర్లకు ఇబ్బందులు లేకుండా, దివ్యాంగులు, వృద్ధుల కోసం వీల్‌చైర్‌లు అందుబాటులో ఉంచారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశామని, ప్రశాంతంగా పోలింగ్ జరగడంతోపాటు పోలింగ్ శాతం పెంచడానికి కృషి చేస్తామని అధికారులు వెల్లడించారు.

☛ నేడు జరగనున్న శాసనసభ ఎన్నికలకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. చిన్నశంకరంపేట మండలంలో వివిధ గ్రామాల్లో అధికారులు 40 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఒక్కొక్క పోలింగ్ కేంద్రానికి నలుగురు ఎన్నికల సిబ్బందితో పాటు ఒక అబ్జర్‌వేటర్‌ను నియమించారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా భారీ పోలీసు భద్రతను ఏర్పాటు చేశారు. పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికల సిబ్బందికి ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. మండలంలో 30,372 మంది తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. ఇందులో 15,616 మంది మహిళా ఓటర్లు, 14,756 మంది పురుషులు ఉన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా 144 సెక్షన్ విధించారు.

☛ పాపన్నపేట మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో ఎన్నికలకు సంబంధించిన అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు.మండల వ్యాప్తంగా 58 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు.ప్రతి పోలింగ్ కేంద్రంలో ఒక పీఓ, ఏపీఓ, ఇద్దరు పోలింగ్ అధికారుల చొప్పున ఏర్పాటు చేశారు. అన్ని పోలింగ్ కేంద్రాలకు బుధవారం సాయంత్రానికి సంబంధిత ఎన్నికల సిబ్బంది అధికారులు చేరుకున్నారు. మండలంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటన జరగకుండా పోలీసులు గట్టి బందోబస్తు చర్యలు చేపట్టారు.


నిజాంపేటలో పోలింగ్ కేంద్రానికి చేరుకున్న పోలింగ్ సిబ్బంది


చిన్నశంకరంపేట: పోలింగ్ కేంద్రానికి చేరుకుంటున్న సిబ్బంది


ఈవీఎంలతో పోలింగ్ బూత్‌కు చేరుకున్న ఎన్నికల సిబ్బంది


నిజాంపేట: నందిగామలో పోలింగ్ కేంద్రాన్నికి సామగ్రితో చేరుకుంటున్న పోలింగ్ సిబ్బంది


పాపన్నపేట పోలింగ్ కేంద్రానికి చేరుకున్న భద్రత సిబ్బంది


రామాయంపేట: పోలింగ్ బూత్ వద్ద పారామిలిటరీ పోలీసుల పటిష్ట భద్రత


రామాయంపేట పట్టణంలో సిద్ధమైన పోలింగ్ బూత్


రామాయంపేట మున్సిపల్‌లో వీల్‌చైర్‌ను పరిశీలిస్తున్న ఎన్నికల అధికారి ఉమాదేవి

# బీఆర్ఎస్‌లో చేరిన కాంగ్రెస్ నాయకుడు

పాపన్నపేట, నవంబర్29: పాపన్నపేట మండలంలోని మిన్‌పూర్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు జంగం రాములు బుధవారం బీఆర్ఎస్ పార్టీలో చేరారు. పాపన్నపేట పార్టీ కార్యాలయంలో ఇఫ్కో డైరెక్టర్ దేవేందర్‌రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరినట్లు పార్టీ మండల సీనియర్ నాయకుడు బాబా గౌడ్ వెల్లడించారు.


ఇఫ్కో డైరెక్టర్ దేవేందర్‌రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరిన కాంగ్రెస్ నాయకుడు జంగం రాములు

# ఘనంగా కార్తిక మాస పూజలు

రామాయంపేట, నవంబర్ 29: రామాయంపేట పట్టణంలోని మహంకాళి ఆలయం, వేంకటేశ్వరస్వామి, దత్తాత్రేయ, నగరేశ్వర ఆలయాల్లో భక్తులు కార్తికమాస పూజలు ఘనంగా నిర్వహించారు. బుధవారం పట్టణంలోని మహిళలు దేవాలయాల్లో పూజా కార్యక్రమాలను చేపట్టి హోమాలు నిర్వహించారు. మహిళలు పెద్ద సంఖ్యలో హాజరై మంగళహారతులు, నైవేద్యాలను సమర్పించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాలను చేపట్టారు.


రామాయంపేటలోని ఆలయంలో కార్తికమాసం సందర్భంగా హోమం చేస్తున్న భక్తులు